సాక్షి తిరుపతి

బుధవారం, 30, ఆగస్టు, 2023





## నిరసన విరమణ

ఎస్వీ యూనివర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్లు చేస్తున్న నిరసన కార్యక్రమం ఎట్టకేలకు ముగిసింది.

- 8లో



## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

రౌడీ షీటర్ల పై నిఘా ఉంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు.

- 8లో

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| తిరుపతి | 34 | 26 |
| చిత్తూరు | 35 | 24 |
| తిరుమల | 30 | 21 |
| గూడూరు | 36 | 27 |
| నగరి | 36 | 25 |

## న్యూస్‌రీల్

### ఉద్యోగ, ఉపాధికి శిక్షణ

**తిరుపతి అర్బన్:** పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవసరమైన నైపుణ్యం పెంపొందించడానికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ కే.విజయప్రతాప్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు అలిపిరి రోడ్డు మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు వివరాల కోసం 9700413939, 9000894035 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### వైద్యుల పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**తిరుపతి తుడా:** శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాలలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టులను భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. పీడియాట్రిక్స్ విభాగంలో నాలుగు సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టులు భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు సెప్టెంబర్ 1వ తేదీన ప్రిన్సిపల్ చాంబర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి కలిగిన వైద్యులు హాజరు కావాలని ఆయన కోరారు. నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లతో పాటు వైద్య విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్, సోషల్ స్టేటస్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు.

# చదువుతోనే ఉజ్వల భవిత

- విద్యకు జగనన్న అండ
- నాడు–నేడుతో పాఠశాలలకు మహర్దశ
- తెలుగు భాషకూ ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున , పక్కన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

**శ్రీకాళహస్తి:** 'మేము చదువుకునే రోజుల్లో ఎవ్వరూ తోడుగా లేరు. సరైన తిండిలేక.. బస్సు చార్జీలకు డబ్బుల్లేక అల్లాడాం. వేసుకోవడానికి దుస్తులు లేక తిప్పలు పడ్డాం. ఇప్పుడు కాలం మారింది. సీఎం జగనన్న విద్యకు అండగా నిలిచారు. విద్యార్థులపై భారీగా పెట్టుబడి పెడుతున్నారు. భవిష్యత్‌ను బంగారు మయం చేసేందుకు తాపాత్రయ పడుతున్నారు. మీకు పౌష్టికాహారంతోపాటు, స్కూల్ యూనిఫాం, బ్యాగు, షూ, బెల్టు ఇలా.. సకల వసతులు కల్పిస్తున్నారు. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారు. మీరు కష్టపడి చదవండి. ఉన్నత శిఖరాలను అధిరోహించండి' అంటూ సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు హితబోధ చేశారు. వారు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల(కాసాగార్డెన్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాత్‌రూమ్‌లు, తరగతి గదులు, డార్మెంట్రీలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న తెలుగు భాష దినోత్సవంలో పాల్గొన్నారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష గొప్పతనాన్ని కొనియాడారు. అనంతరం విద్యార్థినులను సమస్యలడిగి తెలుసుకున్నారు. తాను పూర్ స్టూడెంట్ అని, ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీని విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. 11.6 శాతం ఉన్న పేదరికాన్ని నేడు 6 శాతానికి తెచ్చారన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

### ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు

గతంలో కనీస వసతులు లేక సమస్యలతో సతమతమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ హంగులతో ఆకట్టుకుంటున్నాయని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల సౌకర్యాలకు అందే నిధులను గత పాలకులు మింగేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. సీఎం జగనన్న వచ్చిన తర్వాత రాష్ట్రానికి 18 మెడికల్ కళాశాలలు వచ్చాయన్నారు. పేదవారు చదువుకున్నప్పుడే ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారని చెప్పారు. ఇక్కడ ఉన్న చిన్నచిన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, పాకల మండలి సభ్యురాలు సుమతి, రామచంద్రయ్య, సురేష్, కిరణ్, నాని, భార్గవ్, ఆనంద్ పాల్గొన్నారు.

## • పవిత్రోత్సవం



తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిశాయి. ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలు ముగిసినట్టు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

– తిరుమల

ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి





## పక్కాగా ఓటర్ల జాబితా

**చిల్లకూరు:** ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చిల్లకూరులోని రెండు పోలింగ్ కేంద్రాల పరిధిలోని నాలుగు ప్రాంతాలలో ఓటర్లకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. రెండు చోట్ల డబుల్ ఎంట్రీలు ఉండడంతో వాటిని తొలగించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ రమ్యస్వాతి ఉన్నారు.

### డబుల్ ఎంట్రీలు తొలగించాలి

**నాయుడుపేట:** విన్నమాల సచివాలయ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఓటరు జాబితాను పరిశీలించారు. 73, 74 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఓటర్ల జాబితాను పరిశీలించిన తొలగింపులు, మృతి చెందిన వ్యక్తుల ఓట్లు, వలస వెళ్లిన ఓటర్ల జాబితా, డబుల్ ఎంట్రీలు వంటి వాటిని పరిశీలించారు. సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



చిల్లకూరు: ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

## నేడు, రేపు తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

**తిరుపతి అర్బన్:** పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలైకు బుధ, గురువారాలు తిరుపతి జిల్లా నుంచి వంద బస్సు సర్వీసులు నడపనున్నట్లు తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు బస్సులు తిరుపతి నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ డిపోల నుంచి 100 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినప్పటికీ తిరుపతి మీదుగానే తిరువణ్ణామలైకు వెళ్లనున్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులు ఒకసారి రానుపోను టిక్కెట్ తీసుకుంటే టిక్కెట్ ధరలో 10 శాతం తగ్గింపు ఉంటుందని స్పష్టం చేశారు.

## వేడుకగా బాలగంగమ్మ జాతర


బాలగంగమ్మను దర్శించుకుంటున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

**తిరుపతి మంగళం:** మంగళం పంచాయతీ ఎన్‌సీబీ కాలనీలో బాలగంగమ్మ జాతరను మంగళవారం ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజ లు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి రాంబాబు, ఎంపీటీసీ లక్ష్మి, ఉపసర్పంచ్ బైరెడ్డి రమేష్, వార్డు సభ్యుడు దయాకర్, హరికృష్ణ పాల్గొన్నారు.

## 22ఏ రద్దుతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు


సీఎం జగన్, భూమన చిత్రపటాలకు పాలాభిషేకం

**తిరుపతి మంగళం:** తిరుపతి నగరంలోని పలు ప్రాంతాలు 22ఏ రద్దుతో రిజిస్ట్రేషన్లకు అవకాశం లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్, ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తాతయ్యగుంట పరిసర ప్రాంతాల్లో సుమారు 800 మంది లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

## రౌడీ షీటర్లకు నిరంతరం కౌన్సెలింగ్

**తిరుపతి క్రైం:** రౌడీ షీటర్ల పై నిరంతరం నిఘా ఉంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో తిరుపతి జిల్లాలోని అధికారులు, సిబ్బందితో ఎస్పీ క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సకాలంలో పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి అర్బన్:** అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి ఆసక్తి గల వారు సెప్టెంబర్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 8 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 8 అంగన్‌వాడీ కార్యకర్తలు, 9 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 42 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.



# యువత అభ్యున్నతే లక్ష్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

**తడ:** యువత అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. లెదర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం కాదలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ, లిడ్‌కాప్, ఎస్సీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాలు గత ప్రభుత్వ కాలంలో టీడీపీ నాయకుల జేబులు నింపాయని చెప్పారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు నేరుగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తడలో ఒకటి, విజయవాడలో మరో స్కిల్ కౌన్సిల్ సెంటర్‌ని ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ మండలంలోని మాంబట్టు సెజ్‌లో లెదర్ సంబంధిత అపాచి పరిశ్రమతోపాటు, భారతీయ లెదర్, వీకేసీ వంటి పరిశ్రమలు ఉన్నాయని నేరుగా ఉద్యోగాలు పొందితే వచ్చే జీతం కన్నా ఇలాంటి శిక్షణ తీసుకుని ఉద్యోగం తీసుకుంటే మెరుగైన జీతం, జీవితం లభిస్తుందన్నారు. ఎస్సీ చైర్మన్ కనకారావు మాట్లాడుతూ గతంలో చెప్పులకు, చెప్పులు కుట్టే వారికి ఎంతో ప్రాధాన్యత ఉండేదన్నారు. మారిన ఆధునిక పరిస్థితులు నేపథ్యంలో ప్రతిదీ పారిశ్రామికం కావడంతో చర్మకారులకు పనిలేకుండా పోయిందని ఆవేదన చెందారు. లిడ్‌కాప్ సీఈఓ, ఎండీ డోలాశంకర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు రవికుమార్, శ్రీనివాస్‌తోపాటు తడ ఎంపీపీ కే.రఘురెడ్డి, నాయకులు ఎంవీ కృష్ణారెడ్డి, స్వామిరెడ్డి, మునీష్‌రెడ్డి, ఆర్ముగం పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని, కోచ్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

**తిరుపతి ఎడ్యుకేషన్:** తిరుపతి కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నగరపాలక ఉన్న త పాఠశాల 8వ తరగతి విద్యార్థిని టి.భవ్య కరాటేలోని కుమిట్, కటా విభాగాల్లో ప్రతిభ చాటి మొదటి రెండు స్థానాలను సాధించింది. ఈ నెల 27వ తేదీ చెన్నైలో నిర్వహించిన కరాటే ఓపెన్ వరల్డ్ కప్–2023 చాంపియన్‌షిప్ పోటీ ల్లో పతకాలను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల హెచ్‌ఎం మంగమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థిని భవ్య, కోచ్ కేఎస్ ముస్తఫాలను సత్కరించారు.

## వేటూరి ప్రభాకరశాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి


ప్రభాకరశాస్త్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్వీ వేద వర్సిటీ వీసీ, టీటీడీ డీఈఓ

**తిరుపతి కల్చరల్:** వేటూరి ప్రభాకర శాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి కొనియాడారు. మంగళవారం ప్రభాకరశాస్త్రి 73వ వర్ధంతిని ఎస్వీ ప్రాచ్య కళాశాలలో నిర్వహించారు. కళాశాలలోని వేటూరి విగ్రహానికి నివాళులర్పించారు. కవిగా, చరిత్ర, శాసన పరిశోధకుడిగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా ప్రభాకర శాస్త్రి తనదైన ముద్ర వేశారని అన్నారు. స్విమ్స్ వైద్యుడు అల్లాడి మోహన్, టీటీడీ విద్యాశాఖాధికారి ఎం.భాస్కర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ, ప్రిన్సిపల్ సీతారామశర్మ, అధ్యాపకులు నారాయణస్వామిరెడ్డి, లక్ష్మీనారాయణ, భూపతి నాయుడు పాల్గొన్నారు.

## నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం

**తిరుపతి తుడా:** తిరుపతి నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం అమలు కావాల్సిందేనని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డీ. హరిత స్పష్టం చేశారు. నగరంలో పారిశుద్ధ్యం, యూజర్ చార్జీల వసూళ్లు తదితర అంశాలపై ఎస్వీయూ సెనేట్ హాల్‌లో రెవెన్యూ, శానిటేషన్, అడ్మిన్ సెక్రటరీలతో మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. శానిటరీ సెక్రటరీలు ఉదయం 5.30 గంటలకే తమ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమధవ్, కేఎల్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

**స్మార్ట్ సిటీ పనులు వేగవంతం**

తిరుపతి నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేయాలని మేనేజింగ్ డైరెక్టర్ డీ.హరిత అధికారులను ఆదేశించారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్మార్ట్ సిటీ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

## నిరసన విరమణ

**తిరుపతి సిటీ:** ఎస్వీయూనివర్సిటీలో గత వారం రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని అకడమిక్ కన్సల్టెంట్లు చేస్తున్న నిరసన కార్యక్రమం ఎట్టకేలకు విరమించుకున్నారు. పరిపాలనా భవనం వీసీ చాంబర్‌లో మంగళవారం అకడమిక్ కన్సల్టెంట్ల సమస్యలపై వీసీ రాజారెడ్డి, వర్సిటీ అధికారులు అకడమిక్ కన్సల్టెంట్లతో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం అకడమిక్ కన్సల్టెంట్ల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వారం రోజుల్లో ఈసీ మీటింగ్ ఏర్పాటు చేసి కౌన్సిల్ మీటింగ్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## లారీ డ్రైవర్లపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి


గాయపడిన లారీ డ్రైవర్లు

**నాగలాపురం:** లారీ డ్రైవర్లపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం ఉదయం నాగలాపురం మండలం, బైట కొడియంబేడు గ్రామ సమీపాన చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. చెన్నై నుంచి రైల్వేకోడూరు, బోంబాయి నుంచి చెన్నైకి వెళుతున్న లారీ డ్రైవర్లు నవదీప్, సియారామ్ తమ లారీలతో వచ్చి విశ్రాంతి కోసం బయటకొడియంబేడు సమీపాన ఉన్న దాబా వద్ద ఆపి విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటారు బైకుపై వచ్చి లారీ డ్రైవర్లను డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. దీంతో లారీ డ్రైవర్లు నిరాకరించడంతో దుండగులు తమ వెంట తెచ్చిన కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఆపై లారీ డ్రైవర్లు తిరగబడడంతో దుండగులు పరారయ్యారు. దీనిపై నాగలాపురం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రిప్ ఇరిగేషన్‌తో మామిడిలో అధిక దిగుబడి

**చంద్రగిరి:** మామిడి తోటలకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ అన్నారు. మంగళవారం పనపాకం గ్రామంలో డ్రిప్ ఇరిగేషన్ చేస్తున్న మామిడి తోటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

## నేటి నుంచి శ్రీలక్ష్మీనారాయణ యజ్ఞం

**తిరుపతి రూరల్:** లోక క్షేమం కోసం పేరూరు బండపై వెలసిన శ్రీ వకుళమాత ఆలయంలో బుధవారం నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు శ్రీ లక్ష్మీ నారాయణ యజ్ఞం జరగనుంది. బుధవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు యజ్ఞానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. ఆగస్టు 31న ఉదయం సరస్వతీ నవగ్రహ, సుదర్శన హోమాలు, సాయంత్రం దీపోత్సవం చేపట్టనున్నారు. లక్ష్మీపూజ, కుంకుమార్చన, మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.




**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.60,750 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,473 |

**వెండి:**

| | |
|---|---|
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.75,900 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.77.90 |

# తిరుచ్చిపై కల్యాణ వెంకన్న చిద్విలాసం


తిరుచ్చి వాహనంపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

**చంద్రగిరి:** శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మంగళవారం స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో దేవదేవుడికి ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకార భూషితుడైన స్వామి, అమ్మవార్లు వాహన మండపానికి చేరుకుని తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

# టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం


సౌరబ్ బోరాకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం, పక్కన భూమన అభినయ్‌రెడ్డి, మిలింద కేశవ్ నర్వేకర్

**తిరుమల:** టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా మిలింద్ కేశవ్ నర్వేకర్, సౌరభ్ బోరా తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈఓలు లోకనాథం, గోవిందరాజన్, శ్రీహరి పాల్గొన్నారు.

# సోషల్ మీడియా కన్వీనర్ల పాత్ర కీలకం



సోషల్ మీడియా కన్వీనర్లతో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

**తిరుపతి మంగళం:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు కీలకంగా వ్యవహరించాలని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. నగరంలోని డీపీఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం సోషల్‌మీడియా వలంటీర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా జిల్లా కో–కన్వీనర్ మైలం శ్రీకాంత్‌రెడ్డి, సర్వతేజ, సురేందర్, సుభాష్, దండు ముకేష్, రాజేష్, మునిరాజాలను సత్కరించారు.

**రహదారులతో తిరుపతికి మహర్దశ**

తిరుపతి తుడా: రహదారులతో తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని అభినయ్ రెడ్డి అన్నారు. రేణిగుంట–కరకంబాడి రోడ్డు వయా తిమ్మినాయుడు పాళెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అలానే అలిపిరి రోడ్డు నుంచి మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్, గిరిపురం మీదుగా ప్రతిపాదిత రోడ్డును పరిశీలించారు.

## బ్రహ్మోత్సవం.. సన్నద్ధం

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మాడ వీధులు, ప్రధాన కూడళ్లలో పెయింటింగ్ పనులు జోరందుకున్నాయి. మంగళవారం స్వామివారి ధర్మ రథాన్ని కార్మికులు సన్నద్ధం చేయడం కనిపించింది.

– తిరుమల

